క్లుప్తంగా

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



కోస్గి రూరల్: విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ శేఖర్‌రెడ్డి, కేర్ ఫౌండేషన్ ప్రతినిధి జాన్ సుందర్ అన్నారు. సోమవారం గుండుమాల్ మండల పరిధిలోని బలుబద్రాయపల్లిలో ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివి విద్యా ప్రమాణాలను పెంచుకోవాలన్నారు. క్రమశిక్షణ, దేశభక్తిని అలవర్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్వేత, సీఆర్‌పీ దస్తయ్య, నర్సింహ, వైష్ణవి, శ్రీవాణి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉచిత విద్యుత్ పథకంపై అభిప్రాయ సేకరణ



మద్దూరు: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంపై విద్యుత్‌శాఖ సిబ్బంది వినియోగదారుల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టింది. సోమవారం పట్టణంలోని విద్యుత్ ఏఈ నిరంజన్‌దాస్, లైన్‌మేన్ హన్మనాయక్, సిబ్బంది వినియోదారులు ఇళ్లకు వెళ్లి విద్యుత్ సరఫరా, ఉచిత విద్యుత్, ఆదా అయిన డబ్బులను ఎందుకు వినియోగిస్తున్నారని వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో ఎదైన సమస్య ఉంటే మాకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



నర్వ: కార్తీక మాసం చివరి సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో శివయ్యకు భక్తులు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారు జామున ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో పరమేశ్వరుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. తంబలి నర్సింహయ్య, సిద్దయ్య, నాగస్వామి పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణ్‌వాడి హనుమాన్ ఆలయంలో కార్తీక సోమవారం చివరిరోజు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శివుడికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



నారాయణపేట టౌన్: ఆపదలో ఉన్న పేదలకు చేయూతనిచ్చేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఎనలేని కృషి చేస్తుందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కే.రాజ్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన మాసమ్మ మానసిక స్థితి బాగాలేక ఇటీవల ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నారు. ఆమెకు మెరుగైన చికిత్స కోసం ఆర్థిక సాయంగా రూ.25వేల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఆయనతోపాటు ట్రస్టు సభ్యులు తిప్పన్న, బాలాజీ, సుదర్శన్ రెడ్డి, హన్మంతు, సంతోష్, శివరాజ్, రాజు, గోవింద్, రవి, సిరిగిరి వెంకటేష్ ఉన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

మక్తల్: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శశిరేఖ ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.రూప స్థానిక విలేకరులకు తెలియజేశారు. ఈ నెల 26నుంచి 29 వరకు ఉత్తరఖండ్‌లో జరిగే పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల జీహెచ్‌ఎం వెంకటయ్యగౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.



కృష్ణాలో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ నిజాముద్దీన్



నర్వలో పాఠశాలలో రైస్ స్టాక్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లారెడ్డి



మద్దూరు ఉర్దూ మీడియం పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మెనూ తప్పక పాటించాలి

మక్తల్: విద్యార్థులకు పరిశుభ్రమైన భోజనం అందించాలని ఎంపీడీఓ రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా వంటగది, పాఠశాల గదులు, రికార్డులను తనిఖీ చేశారు. మండలంలో పాఠశాలలకు మధ్యాహ్న భోజనం వండే పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

కోస్గి రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ మేరకు.. వంటగది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మధ్యాహ్నభోజన ఏజెన్సీలకు ఆదేశించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వరి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

మరికల్: మండలంలోని తీలేర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం తహసీల్దార్ జమీల్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు నిర్వాహకులు వండిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని, లేనిచో చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు నిత్యం పరిశీలన చేయాలని తెలిపారు.

కృష్ణా: మండలంలోని తంగిడి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఎంఈఓ నిజాముద్దీన్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. మండలంలో పాఠశాలలకు మధ్యాహ్న భోజనం వండే పిల్లలకు తల్లులతో సమానం కాబట్టి నాణ్యమైన వస్తువులను తెచ్చి భోజనాన్ని రుచికరంగా అందించాలన్నారు. ప్రతి పాఠశాలలో మంచి వాతావరణంలో మంచి కూరగాయలతో భోజనం అందించాలని సూచించారు.



ఊట్కూరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ తదితరులు

ఉర్దూ మీడియం పాఠశాలలో..

మద్దూరు: మండలంలోని పల్లెగడ్డతాండా, మద్దూరులోని ఉర్దూ మీడియం పాఠశాలలను ఎంపీడీఓ నర్సింహారెడ్డి ఎంపీఓ రామన్నతో కలిసి పరిశీలించారు. అనంతరం మద్దూరు ఉర్దూ మీడియం పాఠశాలలో బియ్యం బస్తాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు.

నర్వ: పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ మల్లారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీచేసి, మధ్యాహ్న భోజనానికి అందిస్తున్న రైస్ స్టాక్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామకృష్ణతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ఊట్కూర్: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల, సీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలను సోమవారం ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కుసుమ, ఎంపీఓ లక్ష్మీనర్సింహారాజు, అహ్మద్, సాయినాథ్ పాల్గొన్నారు.

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. వారు మాట్లాడుతూ.. ప్రతి రోజూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం కస్తూర్బ పాఠశాలను తనిఖీచేసి వంట గదిలోని సరకులను పరిశీలించారు. వాకిటి శ్రీనివాసులు, ఎస్‌ఓ రాధిక, వెంకటస్వామి పాల్గొన్నారు.



మరికల్‌లో..



మాగనూర్‌లో..



మక్తల్‌లో ..

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



మాట్లాడుతున్న ఎస్‌ఐ కృష్ణంరాజు

ఊట్కూరు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు.. డాక్టర్. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్‌ఐ కృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజునాథ్, అనిల్‌కుమార్‌గౌడ్, అధ్యాపకులు అశోక్, కోరం శంకర్, నవీన్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాకొండలో పశువైద్య శిబిరం



మరికల్: మండలంలోని రాకొండలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మహదేవ్ పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి పశువులను పరిశీలించారు. అవసరం ఉన్నా వాటికి చికిత్సలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు తమ పశువులకు చికిత్సలు చేయించాలని సూచించారు. వైద్యసిబ్బంది వాసుదేవుడు, శ్రీనివాస్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు



విద్యార్థులచే భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

మక్తల్: పట్టణంలోని శ్రీ భగవాన్– సత్యసాయి మందిర్‌లో రాబోయే గీతా జయంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్థాయిలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులను ఎంపిక చేసి డిసెంబర్ 1న మహబూబ్‌నగర్‌లో జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎంలు రాఘవేందర్‌రావు, మలయాళస్వామి, కోలిమి రాములు, బీంరెడ్డి, సత్యనారాయణగౌడ్, చందులాల్, నవీన్, మల్లికార్జున్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



మద్దూరు: మండలంలోని దోరేపల్లిలో సాయిలు అయ్యప్ప మాలధారుడి ఇంట్లో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. అయ్యప్పకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అయ్యప్ప 18 మెట్ల పూజ నిర్వహించి పడిని వెలిగించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలి



మక్తల్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు



దామరగిద్దలో కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి నిరసన ర్యాలీ కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ. 600 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకటప్ప, సిద్దిలింగప్ప, దానమమ్మ పాల్గొన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించడం తగదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని విస్మరించడం తగదని ప్రగతిశీల రైతు సంఘం మండల అధ్యక్షుడు తాయప్ప అన్నారు. ఈమేరకు.. ఉడ్మల్‌గిద్దలో కరపత్రాలను పంపిణీ చేశారు.

మక్తల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని జిల్లా అధ్యక్షుడు భగవంతు అన్నారు. సోమవారం పట్టణంలోని కరపత్రాలను పంపిణీ చేశారు. మండంలోని ఆయా గ్రామాల్లో నాయకులు పర్యటించారు. వారు మాట్లాడుతూ.. గిట్టుబాటుధర కల్పించాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భగవంతు, టీయూసీఐ జిల్లా ధ్యక్షుడు కిరణ్, భాస్కర్, గోపాల్, రాజు, వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కళాకారుడు చిదానంద్‌కు సన్మానం



కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామానికి చెందిన అవుసలి చిదానంద్ ఇటీవల తాను గీసిన చిత్రాలు, తన కళానైపుణ్యాన్ని గుర్తించి అబ్దుల్ కలాం లెజండరీ అవార్డుకు ఎంపిక చేశారు. ఇందుకు గాను ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో అభిలాష్ హెల్పింగ్ అండ్ ఆర్గనైజేషన్ వారు ఆ కళాకారుడికి అవార్డును ప్రదానం చేయడంతో పాటు ఆయనను సన్మానించారు. సోమవారం ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు మాజీ సర్పంచ్ మహాదేవమ్మ, అంబ్రేష్, కృష్ణామూర్తి, గజ్జి ఆంజనేయులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో సురేష్, ఎమ్మార్పీఎస్ నాయకుడు కల్యాణ్ తదితరులు ఉన్నారు.

మహిళలకు అండగా షీటీం



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: మహిళలకు అండగా షీ టీం పోలీసులు ఉన్నారని కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. మండలంలోని శేర్నపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు, నేరాలు అరికట్టేందుకు షీటీం పనిచేస్తుందన్నారు. మహిళలు, విద్యార్థినుల ఎవరైనా వేధింపులకు గురైతే డయల్ 100, షీటీం సెల్ 87126 70398కు సంప్రదించాలన్నారు. చిన్నారులు, బాలికలను అక్రమంగా రవాణాను అరికట్టేందుకు ఏహెచ్‌టీయూ పనిచేస్తుందన్నారు. ఏదైనా ఇబ్బందులు ఉన్న భరోసా కేంద్రాన్ని సంప్రదించాల న్నారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది చెన్నయ్య, భరోసా కేంద్ర నిర్వాహకులు ప్రమీల, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూత్పూర్ ఆయకట్టు ప్రశ్నార్థకం



ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్వ: మండల రైతుల సాగునీటి ఆశాజ్యోతి అయిన భూత్పూరు రిజర్వాయర్ ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో ఆర్డీఓ రాంచందర్‌కు వినతిపత్రం అందించారు. 1.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన భూత్పూరు రిజర్వాయర్ ద్వారా 40వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. ప్రస్తుత ఈ సామర్థ్యంతో రెండు పంటలకు పూర్తిగా సాగునీరు అందక ఆయా చివరి గ్రామాలైన లక్కర్‌దొడ్డి, పెద్దకడ్మూర్, యాంకి, నాగల్‌కడ్మూర్, కల్వాల్, నర్వ, సీపూర్, కొత్తపల్లి, పాథర్చేడ్, రాయికోడ్, ఆయకట్టు సాగు రైతులు సాగునీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన విషయంలో నిర్లక్ష్యం వీడాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వహణలో నిర్లక్ష్యాన్ని వీడాలని పీవైఎల్ నాయకులు రవి, శ్రీకాంత్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని బండగొండ యూపీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యతతో కూడిన భోజనాన్ని వడ్డించాలని ఉపాధ్యాయులను కోరారు. అదేవిధంగా విద్యాబోధనకు పూర్తిస్థాయి ఉపాధ్యాయుల నియామకం, విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శ్రీకాంత్, అజయ్, శ్రీహరి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కు ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న వికలాంగులు

నారాయణపేట టౌన్: ప్రభుత్వం ఎన్నికలకు ముందు వికలాంగులకు ఇచ్చినహామీ రూ.6వేలు కొత్త పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ.. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద ధర్నా చేపట్టారు. ఈ మేరకు.. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి. రాధమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం 2024 జనవరి నుంచి రూ. 6 వేలు కొత్త పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చి ఏడాది పూర్తయిందన్నారు. లక్షలాది మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ఉచిత బస్సుపాస్ సౌకర్యం, వివిధ శాఖల్లో ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేపట్టాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణకు అందజేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

మక్తల్: మండలంలోని సగంబండలో బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ మేరకు.. డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ విరోజా హాజరై విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. చిన్నారులు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలను తెలుసుకుని వాటికి అవసరమైన మందులు అందించారు. వారు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతపాటు వ్యక్తిగత శుభ్రతను పాటించడంతో అనేక రోగాలు సోకకుండా నివారించొచ్చన్నారు. నిత్యం పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అనసూయ, ఆశాకార్యకర్తలు కాలమ్మ, అనిత, ప్రిన్సిపాల్ చంద్రకళ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో బహుళ ప్రయోజనాలు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేష్‌కుమార్

అమరచింత: గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాల కట్టడికి దోహదపడుతాయని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మండలంలోని నందిమళ్ల ఎక్స్‌రోడ్‌లో సోమవారం సీసీ కెమెరాల ఏర్పాటు గురించి ప్రజలతో పాటు ఆయా రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలు గ్రామంలోని నలుమూలల ఉంటే రాత్రి వేళల్లో అపరచిత వ్యక్తుల వల్ల కలిగే అనర్థాలను గుర్తించడమే కాకుండా చోరీలు, నేరాలను నియంత్రించే అవకాశం ఉందన్నారు. గ్రామ ప్రజలు కలిసి వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తర్వాత వాటిని పోలీస్ స్టేషన్ నుంచే మానిటరింగ్ చేస్తూ నేరాలు జరగకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కురుమన్న, మల్లారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు నాసిరక మరమ్మతు



నాసిరకం మరమ్మతు పనులు చూపిస్తున్న నాయకులు

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లి నుంచి అమరచింత నాగల్‌కడ్మూర్ ఎక్స్‌రోడ్ వరకు కొనసాగుతున్న బీటీ రోడ్డు మరమ్మతు పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. ఏడు కిలోమీటర్ల మేరకు రూ.9 లక్షలతో చేపడుతున్న రహదారి ప్యాచ్ వర్క్‌లను సదరు కాంట్రాక్టరు నాసిరకంగా చేపడుపతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికే రహదారి పూర్తిగా బీటీ ఊడిపోయి గుంతలమయంగా మారిందని, అలాంటి రహదారిని పూర్తి స్థాయిలో నిర్మంచకుండా మరమ్మతుల పేరిట నిధులు మంజూరు చేయడం ఏమిటన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాసిరకం పనులు చేపడుతున్న సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లి, వెంకటేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష

ఆత్మకూర్: మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తిని వనపర్తి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. మండలంలోని పిన్నంచర్లకు చెందిన తోకలి భీమన్నపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చామన్నారు. రెండు రోజులు జైలుశిక్ష విధించారని వివరించారు.

8 మందికి..

అమరచింత: డ్రంకెన్ డ్రైవ్‌లో 8 మంది పట్టుబడగా.. ఆత్మకూర్ ఇన్‌చార్జ్ మెజిస్ట్రేట్ జానకి ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించారు.